# చీకటి దీపాలు



"ఛీర్స్ . . ." అంటూ గుటకలో డిప్లమాట్ విస్కీ మొదటి గ్లాసు ఖాళీచేశాడు శేఖరం.

ఓపెన్ ఎయిర్ బార్‌లో కూర్చున్న మా చుట్టూ ఎవరూ లేకపోవటం ఒక విశేషం. దానికితోడు చల్లని

రాత్రి. పూలవాసనలు పంచిపెడుతున్న బరువైన గాలి. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ అప్పుడప్పుడూ "జావేద్" సంగీతం హాయిగా వినిపిస్తూంది.

"నెక్స్ట్ రౌండ్..." అన్నాను మరోసారి అతని గ్లాసు నింపే ఉద్దేశ్యంతో.

"లేదు, బ్రదర్. ఫార్మాలిటీ... ఫార్మాలిటీయే! నాకు ఆడపిల్లల్లా కొద్దికొద్దిగా సిప్‌చేస్తూ తాగే అలవాటు లేదు. సారీ, మీరు కానివ్వండి." శేఖరం ఒకసారి నక్షత్రాలుమాత్రం కనిపిస్తున్న ఆకాశాన్ని చూశాడు. "అసలే చేస్తున్నది చెడ్డపని. అందులో ఫార్మాలిటీస్... పద్ధతులు... దీన్నే మనం నాగరికత అంటాం..." విరక్తిగా తన గ్లాసు తనే నింపుకున్నాడు శేఖరం.

నేను అటు చూడనట్లు తల వంచుకున్నాను.

"పూర్వీకుల్ని, పతివ్రతల్ని, ముఖ్యంగా మహా పురుషుల్ని, వాళ్ల ఆదర్శాల్ని ద్వేషించేవాణ్ణి. ఇప్పుడిప్పుడే వాటిమీద కాస్త నమ్మకం కలుగుతూంది." మళ్లీ తనే అన్నాడు.

"ఇప్పుడిప్పుడే అంటే డిన్నమాట్ తాగిన తరువాతా?"

"అహా.... అసలు తాగుడే మొదలుపెట్టక ముందు. ఇప్పుడు నన్ను నేనే మహాపురుషుడను కుంటున్నాను. కాదంటావా?"

అనే ధైర్యం లేదు. కైపులో తన్నినా తన్నవచ్చు.

"నువ్వెప్పుడయినా దేవుణ్ణి చూశావా?" చాలా తీవ్రంగా అడిగాడు.

"నువ్వు చూసిఉంటావ్, డిన్నమాట్‌కన్న మరో మంచి సరుకు తాగినప్పుడు."

ఆ మాటతో శేఖరానికి ఛర్రున కోపం వచ్చింది. "బ్రదర్, తాగినంతమాత్రాన అంత చులకనగా మాట్లాడటం బాగుండదు. నీకొక కథ చెబుతాను, వింటావా?"

"అది కథే అయితే నా కవసరంలేదు."

"దాన్ని నిజం అనడంకన్నా కథే అనడం మంచిది. నిజం అనుకుంటే నేను ఎక్కువ కాలం..." అతని గొంతులో జీర వినిపించింది.

"దిగులుపడిపోతున్నావా? అయితే నువ్వు దేవుణ్ణి చూడలేదు."

"చూశాను కాబట్టే ఇంతకాలం బతికిఉన్నాను. ఈనాడు తాగినా నా లిమిట్స్‌లో ఉంటున్నాను. కనీసం ఇతరులను గురించి ఆలోచించగలుగుతున్నాను."

"అయితే పూర్వం నీకా ఆలోచన లేదన్నమాట."

"నేనేకాదు, మనిషి అనేవాడు తనని గురించి తప్ప ఇంకెవరి గురించీ ఆలోచించడు. అలా ఆలోచిస్తే ఈ ప్రపంచం ఇంత పురోగమించదు. ఈ రాజకీయాలు పుట్టవు."

"ఫిలాసఫీనుంచి పాలిటిక్సుకు జంప్‌చేస్తున్నావా?"

"అయితే నా కథ వినాలనే ఇన్‌స్పైట్ నీలో ఆరంభ మైందన్నమాట. ఈ కథ మామూలుగా ఉన్నప్పుడు చెప్పమంటే చెబుతాను. చెప్పడానికి మూడ్‌కాదు, ధైర్యం కావాలి. దాని తాలూకు షాక్ వచ్చినప్పుడు తట్టుకోగల మనోబలం నాకు లేదు."

శేఖరం మరో గ్లాసు నింపుకొని సిగరెట్ వెలిగించాడు.

"కథ చెప్పేముందు ఇది దాదాపు లవ్ ఎఫైర్‌లాంటి దంటే తెలిసిపోతుంది. దానిమీద సదభిప్రాయం ఉండదు. అసలు నన్నడిగితే అన్ని కథలూ ఒకలాగే

**మనసులో వెలిగించుకున్న మమతాజ్యోతులు, వెలుగు కాంతుల బదులు, గాఢతిమిరాలను పంచిపెట్టడం బాధగా ఉంటుంది. అవే చీకటిదీపాలు. రక్తపంచి ఇచ్చిన ప్రతిస్త్రీ మాతృసమానురాలైతే, రక్తంకన్న విలువైన అనురాగామృతాన్ని పంచి ఇచ్చిన పెన్నది ఏం కావాలి?**

ఆరంభమవుతాయి. ప్రస్తుతం ఈ కథ ఎక్కడ మొదలుపెట్టాలో అర్థంకావటంలేదు. నే నామెను చూసినప్పుడా... ఆమె నన్ను చూసినప్పుడా?... ఆల్‌రైట్... సిపాయిల కలహం ఎప్పుడు జరిగిం దంటే నేను చెప్పలేను. కాని ఆమెను చూసిన తేదీ చెప్పమంటే కరెక్ట్‌గా చెప్పగలను. ఇప్పుడు నా వయస్సు ఎంత ఉంటుందంటావ్?"

"ముప్ఫై ఏప్ఫైన..."

"ముప్ఫై ఏరెండు. కథ జరిగి ఏడేళ్లయింది. అప్పుడు ఆమె వయస్సు ఇరవైఏడు. అంటే, ఆమె నాకన్న పెద్దది..." ఒకసారి నా ముఖంలోకి చూసి మళ్లీ ఆరంభించాడు. "నవ్వకు. దీన్ని నేను లవ్ ఎఫైర్ అనడంలేదు. చాలామంది ఆ కలర్ ఇచ్చారు. నీలాంటి మిత్రుడితో ప్లాట్‌ఫారమ్‌మీద నడిచిపోతున్న ప్పుడు ఆమె కనిపించింది. నిజంగా తెల్లటి చీరలో... నాకు వర్ణించడం చేతకాదుగాని, అప్సరసలా ఉంది. ఎవరని అడక్కుండానే ఆ ఫ్రెండు గడగడా నాలుగు కొపులు ఆమెని గురించి చెప్పాడు. సారాంశం ఏమిటంటే, ఆమె భర్త ఆమెను వదిలేసి మరో పెళ్లి చేసుకున్నాడట ... అంతే... ఆ చివరి మాటలే గుర్తున్నాయి. ఎందుకు, ఎలా వదిలేశాడో నాకు తెలియదు. ఎంతసేపు ఆలోచించినా అంతుచిక్కలేదు. ఆమె జీవితంలో చిక్కని చీకటిలాంటి విషాదం పేరుకుందన్నమాట. పైకి మనిషిలా తిరుగుతున్నా ఆమె గుండెలో తేళ్ళూ, జెర్రులూ నివాసం ఏర్పరుచుకున్నాయి. రకరకాల భావాలతో దాదాపు రెండురోజులు గుక్కతిప్పుకోలేక పోయాను. మొత్తంమీద ఏదో ఆవేదన నా హృదయం మీద ముద్రవేసింది. నా మనస్సు చెబుతున్నది వినకుండా, ఆలోచించకుండా ఉండలేకపోతున్నాను."

"పూర్వం ఇతరులగురించి ఆలోచించేవాణ్ణి కాదన్నావ్?"

"చివరివరకూ వింటే నువ్వే ఒప్పుకుంటావు. మూడవరోజు మళ్లీ అదే స్థలానికి వెళ్లాను. ఆరోజు వాన కురుస్తూంది. కాస్త చీకటిపడింది. అప్పుడే అటువేపు వస్తున్న ఆమెకేసి హఠాత్తుగా చూశాను. ఆ చిమ్మచీకట్లో పెద్ద వెలుగులా కనిపించింది.

"ఇక అప్పటినించి అక్కడే మకాం. రోజులూ, నెలలూ గడిచిపోయాయి... ఇది వన్‌సైడెడ్ స్టోరీ భాయ్... రెండోవైపు కథ చెప్పలేను. అందుకే ఈ కథ ఎవరికీ చెప్పను." స్వగతంలా చెప్పుకుపోతున్నాడు

**ఎస్. ఎస్. లాల్**

శేఖరం. "ఒకరోజు ఉన్నట్టుండి ఒక ఆలోచన తట్టింది. ఆమెవెనకే నడిచి వెళ్లాను. కొంతదూరం వెళ్లి ఆమె లేడీస్ హాస్టల్‌లో ప్రవేశించగానే నాకు కథ కాస్త అర్థమైంది. అంటే ఆమె లెక్చరర్ అన్న మాట. ఒంటరిగా జీవితం గడుపుతూ, కాలేజీలో ఉద్యోగం చేస్తూ ఈ హాస్టల్లో పడిఉంటుందన్నమాట.

"మరునాడు అదే వేళకు మళ్లీ అక్కడ తయా రయ్యాను. ఈసారి ఆమెవెంట మరో అమ్మాయి ఉంది. ఆమెకన్న సన్నగా, నల్లగా ఉంటుంది. నిజానికి నలుపు అనడానికి వీల్లేదు. ఆమెపక్కన ఎవరు నుంచున్నా నల్లగానే కనిపిస్తారు.

"ఈసారి ఆమె దగ్గిరగా వచ్చి ఒకసారి నావైపు చూసి వెళ్లిపోయింది. ఆ చూపులో ఏముందో, నా హృదయం కంపించిపోయింది. మరో గంటవరకూ అక్కణ్ణించి కదలలేకపోయాను. బహుశా నిన్నటి సంఘటన ఆమెకు బాధ కలిగించిఉంటుంది.

"ఇక ఆమెకంట పడే ధైర్యం నాకు లేదు. ఆమె వచ్చే వేళకు పార్కులో కూర్చొని చెట్లమధ్యనించి చూసే వాణ్ణి... వత్త రోగ్‌ని! ఎందు కలా చూడటం? అర్థమయ్యేదికాదు. ఒక్కక్షణంలో ఆమె దాటిపోయేది. మళ్లీ ఆ క్షణంకోసం ఇరవైనాలుగు గంటలు ఆగాలి. ఏదో ఆందోళన నన్నూ, నా హృదయాన్నీ కలవరపరిచేది. గంటలతరబడి అలా కూర్చొని ఆలోచించేవాణ్ణి. నడక సాగిస్తే మైళ్ళు దాటేవాణ్ణి.

"ఒకరోజు రాత్రి అలా నడుస్తూ టెలిఫోన్‌బూత్ దగ్గిర ఆగాను. ఎందుకో ఆమెతో మాట్లాడా లనిపించింది. హాస్టల్ నంబర్ డైరెక్టరీలో ఉంటుంది. అయితే ఆమె పేరు?... ఆలోచించాను... సరోజా?... లేద భారతి?... పార్వతి... ఏది నోటికి వస్తే అది.

"రింగ్‌చేశాను. అవతల ఫోన్ ఎవరో ఎత్తారు ... "హలో..." ఎవరో స్త్రీకంఠం... గుండె దడదడలాడింది. "హలో... ఎవరు కావాలండి?" ఆమె ఎవరో నిద్రమత్తులో ఉన్నట్టుంది. మగతగా అంది. "సరోజ... ఆహా, భారతిగారు కావాలి..." అవతలనుంచి "ఏ భారతి?" అన్న ప్రశ్న వినిపించింది. "అదే...లెక్చరర్‌గా పనిచేస్తూంటారు... మీ హాస్టల్‌లోనే ఉంటారు..." కాస్సేపు నిశ్శబ్దం. మళ్లీ మరో స్త్రీకంఠం విసుగ్గా వినిపించింది. "ఎవరండి మీరు?" ఎవరన్న ఆమె ప్రశ్నకు ఏమని సమాధానం చెప్పగలను? "మీకేం కావాలి?" మరో ప్రశ్న. నాకేం కావాలో నాకే తెలియదు. "హలో... హలో..." ఇక నేను మాట్లాడాలి. "ఇది టెలిఫోన్ అయిపోయింది. టెలివిషన్ అయితే నే నెవరైంది చటుక్కున తెలిసిపోయేది." "మీ పేరు?" ఆమె స్వరంలో తీవ్రత ధ్వనించింది. "నా పేరు సోమశేఖర్." నిజం చెప్పాను. "ఎందుకు ఫోన్‌చేశారు?" చాలా కోపంగా అంది. ఇదే ఆమె గొంతయితే ఇంత కర్కశంగా ఉండదనే అభిప్రాయంతో లైన్ కట్‌చేశాను.

"అప్పటినించి రోజు కోసారి టెలిఫోన్‌ద్వారా తెలిసిన పేర్లతో తంటాలుపడటం మామూలయి పోయింది. ఎంత ప్రయత్నించినా సరైన రెస్పాన్సు రాలేదు.

"ఒకరోజు ఆమె వచ్చేవేళకు పార్కులో కూర్చు న్నాను. నా వెనక ఒక స్త్రీకంఠం వినిపించింది.

(తరువాయి 34 వ పేజీలో)



'లతాంగి'-

ఫోటో—కె. గోపాలకృష్ణమూర్తి (బాపట్ల)

(31 వ పేజీ తరుతాయి)

వెనక్కి తిరిగి చూశాను. అప్పుడప్పుడు ఆమెవెంట వచ్చే నల్లమ్మాయి కనిపించింది. ఆశ్చర్యాన్ని దిగమింగలేక అలాగే నిలబడిపోయాను. "రేపు మా కాలేజీ యానివర్సరీ . . . మీరు సాయంత్రం ఫంక్షనుకు రండి." అలాగే అన్నట్లు తల ఊపాను. ఆమె గిరుక్కున వెనక్కి తిరిగింది. "ఆగండి . . ." ఆమె ఆగింది. "మీ స్నేహితురాలి పేరు చెప్పగలరా?" ఆమె సన్నగా నవ్వి "శారద" అంది. కొలంబసు కొత్తఖండాన్ని కనుక్కున్నంత సంతోషంతో తబ్బిబ్బయ్యాను. 'శారద' అని నాలో నేనే అనుకున్నాను మరోసారి. ఆ నల్లమ్మాయి వెళ్లిపోయింది.

"మరునాడు కాలేజీకి నాలుగింటికే వెళ్లిపోయాను. ఆమె కనిపిస్తుందని కళ్లు చించుకొని చూశాను. ఎక్కడా ఆమె జాడలేదు. ఉపన్యాసాల తరవాత నాటకాలు ఆరంభమయ్యాయి. నేను మాత్రం నాటకం చూడటంలేదు. ఇంతలో ఒక ముసలాయన నా భుజం మీద చెయ్యివేసి బయటికి రమ్మన్నాడు. ఎందుకో అర్థంకాక బయటికి వచ్చాను. నన్ను తిన్నగా ఒక గదికి, అంటే దాదాపు ఏకాంతస్థలానికి తీసుకు వెళ్లాడు. "కూర్చోండి" అన్నాడు. కూర్చున్నాను. "రోజూ మా హాస్టల్‌కు ఫోన్‌చేసేది మీరేనా?" "కాదు." కచ్చితంగా అబద్ధం చెప్పాను. "అవునో, కాదో మీ మొహమే చెబుతూంది. ఇటువంటి పనులు మీలా చదువుకుంటున్నవారికి తగవు." ఈసారి నిజంగా నా మొహం పాలిపోయింది. తరవాత పాతరామాయణం అంతా తిరగేసి, నానాచివాట్లు పెట్టి బయటికి పంపేశాడు. తిన్నగా నా గదికి వెళ్లి చీకట్లో అలాగే కూర్చున్నాను. నిద్రపట్టడంలేదు. లైటు వెలిగించడానికి భయంగా ఉంది. అతనన్న మాటలు గుండె దూసుకుపోతున్నాయి. తర్కవితర్కాలలో పడి కొట్టుకుపోతున్నాను. మళ్లీ లేచి గదికి తాళంవెయ్యకుండానే హాస్టల్‌వేపు వచ్చాను. బయట గూర్ఖా నిద్రపోతున్నాడు. గోడపక్కన ఉన్న మామిడిచెట్టు కొమ్మ పట్టుకొని నెమ్మదిగా లోపలికి దిగాను. నిర్మానుష్యంగా ఉంది. మేడమెట్లెక్కి అంచనాప్రకారం ఒక గది దగ్గిరికి వచ్చాను. అది ఆమె గదే అయిఉండాలి. తలుపు కొట్టేముందు ఒకసారి ఆగాను. జరిగిన సంఘటన తలుచుకొని ఉద్రేకంగా తలుపు కొట్టాను. కొద్ది క్షణాల్లో తలుపు తెరుచుకుంది. అదే తెల్లని చీరలో అప్సరసలా నా కెదురుగా నిలబడింది. వెనకనుంచి "ఎవరది?" అన్న మరో స్త్రీ కంఠం. ఆమె ఎవరో నన్ను దొంగ అనుకున్నట్లుంది. తలుపుదగ్గిర నిల్చున్న శారదను వెనక్కిలాగి "ఎవరు నువ్వు?" గట్టిగా అరిచేసింది. ఇంతలో పక్కన ఉన్న తలుపులు తెరుచుకున్నాయి. నాకుకిందికిదిగే దారి దొరక్క పై అంతస్తుకు పారిపోయాను. కింద కల్లోలం ఆరంభమైంది. కేకలూ, అరుపులూ వినిపించసాగాయి. క్రమంగా పైనున్న గదులు తెరుచుకుంటున్నాయి. ఒక్కొక్క గదినుంచి దయ్యాల్లా ఇద్దరిద్దరు వస్తున్నారు. ఇక గత్యంతరం లేక పైప్‌లైన్ పట్టుకొని కిందికి దిగాలని ప్రయత్నించాను. నాలుగు అడుగులు దిగగానే కాలు జారింది. కొద్దిక్షణాల్లో నా చుట్టూ పెద్ద కోలాహలం.

"మరునాడు పన్నెండుగంటలకు నాకు స్పృహ వచ్చింది. నెమ్మదిగా కళ్లు తెరిచాను. మొట్టమొదట నా గదిలాగే కనిపించింది. తరవాత తెల్లని సీలింగ్, పైనుంచి తలకిందులుగా వేలాడుతున్న సెలైన్ బాటిల్సూ, నర్సులూ కనిపించారు. "అదిగో, చూశావా తెలివి వస్తూంది." ఒక స్త్రీకంఠం వినిపించింది. చుట్టూ చూశాను. బెడ్‌పక్కన నల్లమ్మాయి కనిపించింది. తరవాత శారద! నా కళ్లు నేనే నమ్మలేకపోయాను. నేను కళ్లు విప్పి సరిగ్గా చూశానో, లేదో శారద వెళ్లిపోయింది. నల్లమ్మాయికూడా వెనక్కి తిరిగింది. "ఆగండి . . ." అన్నాను. జరిగింది నే నడక్కుండానే ఆ అమ్మాయే చెప్పింది. "మీవల్ల రాత్రి చాలా గొడవ పడిపోయాం. మీరు బాధపడవద్దు. అంత పైనించి కింద పడేసరికి తలకు దెబ్బ తగిలి రక్తం చాలా పోయింది. మీవాళ్లు ఎవరో, ఎక్కడున్నారో మాకు తెలియదు. ఉదయం డాక్టర్ కొత్తరక్తం ఇవ్వందే బతకడం కష్టం అన్నారు. అప్పుడు మా శారదే మీకు రక్తం ఇచ్చింది." ఆ మాటలు వింటున్న నా కళ్లు గిరగిరా తిరిగిపోయాయి. మళ్లీ స్పృహ తప్పిపోయింది.

"నాలుగురోజులవరకూ శారద కనిపించలేదు. ఆమె మళ్లీ దూరంగా వెళ్లిపోయిందన్నమాట. నామీద నాకే విసుగుకు,చిరాకు, రోత. క్రూరతరహాగా ప్రవర్తించానేమోనని నన్ను నేనే నిందించుకున్నాను. చివరికి అయిదవరోజు శారద వచ్చింది. ఈసారి నల్లపిల్ల రాలేదు. ఆమె ఒంటరిగా ఉంది. "కూర్చోండి." సూటిగా ఆమెవైపు చూడకుండా అన్నాను. ఆమె కూర్చుంది. ఏం మాట్లాడాలో తోచలేదు. "ఆరోగ్యం ఎలా ఉంది?" ఆమె అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. కన్నార్పకుండాఆమె నన్నుచూస్తున్నట్లుంది. మొండిధైర్యం తెచ్చుకొని అన్నాను. "ఇంత జరిగిన తరవాత మీరు నన్నెందుకు బతికించారు?" ఆమె సమాధానం చెప్పలేదు. నెమ్మదిగా తల పక్కకి తిప్పి ఓరగా చూశాను. "నాకూ మీకూ ఏ సంబంధం ఉందని మీరు ఈ ఉపకారం చేశారు?" ఈసారి కసిగా అడిగాను. "పూర్వం లేకపోయినా ఇప్పుడుంది." నన్ను జాలిగా చూస్తూ అంది. "ఏమిటది?" అదే ఆవేశంతో అడిగాను. "నువ్వు నా రక్తం పంచుకున్నావ్. ఇక నేను నీకు అమ్మను . . . రక్తాన్ని పంచి ఇచ్చిన తల్లిని. . ."

"మూడంతస్తుల మేడనుంచి పడిన దెబ్బకన్నా బలంగా తగిలింది ఆమె మాట. ఒక్కసారిగా నా నరాల్లో ప్రవహిస్తున్న రక్తం పోటెత్తింది. ఉద్రేకంతో నా హృదయం ఉక్కిరిబిక్కిరైంది. ఉప్పెనలా నా కళ్ల నుంచి పెద్ద ప్రవాహం పొంగింది.

"బహుశా నా కళ్లనుంచి జారింది ఆమె రక్తమే అయిఉంటుంది! . . . ."

శేఖరం కళ్లు తుడుచుకున్నాడు.

అంతటితో తన కథ ఆపలేదు. అయినా అతని మాటలు వినే స్థితిలో నేను లేను. ★